ACCION FRATERNA ecology centre
sustainable . human . nature

# ఎ.ఎఫ్. ఎకాలజీ సెంటర్, అనంతపురం.

ఈ మాసపు సమాచారం ఆగస్ట్ - సెప్టెంబర్, 2010

FOR PRIVATE CIRCULATION ONLY

# సస్యమిత్ర గ్రూపుల ఏర్పాటు విధానాలు - ఆచరణాత్మక మార్పులు

## 1. పరిచయము

2007 సంవత్సరం జూలై నెల నుండి ఎకాలజీ సెంటరు 230 గ్రామాలలో దాదాపు 45,000 రైతు కుటుంబాలతోపాటు మరియు 5,000 కూలీ కుటుంబాలతో పని చేస్తున్నది. రైతు కుటుంబాలన్నింటిని దాదాపు 1,400ల సస్యమిత్ర గ్రూపులుగా ఏర్పాటు చేయడమైనది. అయితే గత 3 సంవత్సరాల అనుభవాలను ఒకసారి సమీక్షించినపుడు ప్రతి గ్రామంలోనూ, దాదాపు అన్ని కుటుంబాలతో కలిసి పని చేస్తుండడం వలన, ఉన్న శ్రమ వనరులతో అన్ని గ్రామాలను, అన్ని గ్రూపులను ఆశించినంత స్థాయిలో ప్రభావితం చేయలేకపోతున్నమని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాము. ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, మన సంస్థ పని విధానములో కొన్ని ముఖ్యమైన మార్పులు ప్రవేశపెడుతున్నాము. ఇపుడు ఎకాలజీ సెంటరు ప్రతి గ్రామంలోనూ రెండు స్థాయిలలో పని చేయాలని భావిస్తున్నది. గతంలో మనం ఏర్పర్చుకున్న విధానాలలో ఆచరణాత్మకంగా ఉండడం కొరకు స్వల్పంగా మార్పులు చేర్పులు చేయడం జరిగింది.

### మొదటి స్థాయి - ప్రతి గ్రామంలోని అన్ని కుటుంబాలతో :

సుస్థిర వ్యవసాయం, ఉపాధి హామీ పథకాలపై అవగాహన కార్యక్రమాలు, సుస్థిర వ్యవసాయ పద్ధతులపై సాంకేతిక సలహాలు (ఎన్.పి.ఎమ్, ద్రవ జీవామృతం, ఫర్‌మోన్ ట్రాపులు, ఆకర్షణ బోర్డులు మొదలగు వాటిపై) ఇతర గ్రామీణ జీవనోపాదుల చేతివృత్తుల అభివృద్ధి / ఏర్పాటు, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొనుట, ప్రభుత్వ విధానాలపై సూచనలు, యువజన కార్యక్రమాలు మొదలగు వాటితో గ్రామంలోని అన్ని కుటుంబాలతో కలిసి పని చేయడం జరుగుతుంది.

### రెండవ స్థాయి - ఎన్నిక చేసుకున్న 100 కుటుంబాలతో :

ప్రాజెక్ట్ ఏరియాలో ఉన్న 230 గ్రామాలలో, ప్రతి గ్రామంలోనూ వివిధ వర్గాల నుండి అర్హులైన 100 కుటుంబాలను ఎన్నిక చేసుకొని, వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చేయాలని ఎకాలజీ సెంటరు నిర్ణయించింది. వివిధ వర్గాల నుండి అర్హులుగా ఎంపిక చేసిన 100 కుటుంబాల నుండి వచ్చిన సభ్యులతో 25 మందితో ఒక గ్రూపుగా ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఒక్కొక్క కుటుంబం నుండి ఒక్కొక్కరు (మహిళ కావచ్చు, పురుషుడు కావచ్చు) సభ్యులుగా ఉంటారు.

1. వర్షాధార రైతులు (అన్ని కులాలకు సంబంధించిన వారు) - 1 లేక 2 గ్రూపులు.
2. యస్.సి. / యస్.టి. వర్షాధార రైతులు - 1 గ్రూపు
3. నీటి పారుదల వసతి కలిగిన రైతులు - 1 గ్రూపు
4. కూలీలు - 1 గ్రూపు

**చిట్కా : తేలు విషానికి బొప్పాయి కాయ నుండి తీసిన రసం పూస్తే విరుగుడుగా పనిచేస్తుంది.**

ప్రతి గ్రూపులోని 25 సభ్యులకుగానూ 13 మంది మహిళలను 12 మంది పురుషులను చేర్చుకోవాలి. ప్రతి క్లస్టరులోనూ ఏదైనా ఒక గ్రామంలో 4 గ్రూపులను పూర్తిగా మహిళా సభ్యులతోనే ఏర్పాటు చేయాలి.

## 2. నాలుగు రకాల గ్రూపులు - లక్ష్యాలు - కార్యక్రమాలు

### 1. వర్షాధార రైతుల గ్రూపులు (అన్ని కులాలవారు)

**ఎ) ఉద్దేశ్యములు :**

(1) గ్రూపులోని సభ్యుల మధ్య పరస్పర సహకార పద్ధతిని ఏర్పాటు చేయుట. (2) గ్రూపులోని సభ్యులందరూ తమ పొలంలోనూ మరియు స్థానికంగా లభించు సేంద్రీయ సహజ వనరులను వినియోగించుకొంటూ తక్కువ ఖర్చుతో వ్యవసాయము చేసి శాశ్వత అధిక ఉత్పత్తిని సాధించుట. (3) రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం నిలిపివేసి స్థానిక వనరులతో తామే తయారు చేసుకొన్న సేంద్రీయ ఎరువులు వాడుట. (4) రసాయన మందులు వాడకుండా చీడ పీడల నివారణ చేయుట ద్వారా, భూమి ఉత్పాదకతను పెంచడంతో పాటు, పెట్టుబడులను బాగా తగ్గించుకొనుట. (5) గ్రూపు సభ్యుల మధ్య పరస్పర సహకారమును పాటించుట. (6) బహుళ పంటలు, వృక్ష పంటలు, ఆహార పంటలు, పశుపోషణ ద్వారా కనీసం కుటుంబ పోషణకు సమతుల్య ఆహార భద్రతను సాధించుట. (7) ప్రభుత్వ వనరులను కార్యక్రమాలను సక్రమంగా వినియోగించు. (8) ఉపాధి హామీ పథకం ద్వారా తాత్కాలిక ఉపశమనం పొందుతూ వివిధ రకాల వృక్ష పంటలనూ, దీర్ఘకాల, సుస్థిర వ్యవసాయోత్పత్తిని అభివృద్ధి చేసుకోవడం ద్వారా నమ్మకమైన బహుళ ఆదాయ మార్గాలను ఏర్పాటు చేసుకొనుట. (9) ఆదాయ భద్రతతో జీవన విధానాన్ని మెరుగు పరుచుకుని గౌరవప్రదమైన జీవనం గడుపుట.

గ్రామానికి కనీసం 2 మెట్ట రైతుల గ్రూపులు ఏర్పాటు చేయడం జరుగుతుంది. యస్.సి. / యస్.టి. వర్గాలవారు గ్రూపుగా ఏర్పడడానికి తగినంతమంది లేకపోతే, ఇతర వర్గాలతోపాటు గ్రూపులు ఏర్పాటు చేయాలి. వీరికి మొదటి ప్రాధాన్యతనివ్వాలి.

1) అన్ని వర్గాల మెట్ట రైతుల గ్రూపు

2) యస్.సి., యస్.టి. వర్గాల మెట్ట రైతుల గ్రూపు

### 2. ఎస్.సి. / ఎస్.టి. వర్గాల మెట్ట రైతుల గ్రూపు :

పైన చెప్పిన అర్హతలన్నీ వీరికి కూడా వర్తిస్తాయి. అదనంగా (1) గ్రామంలో ఎస్.సి. మరియు ఎస్.టి. కుటుంబాలు తక్కువగా ఉన్నప్పుడు వారిలో నీటి వసతి కలిగిన కుటుంబాలు నీటి సాగు రైతుల గ్రూపులోనూ, మెట్ట భూమి మాత్రమే కలిగిన కుటుంబాలు మెట్ట రైతుల గ్రూపులోను ఉంటారు. (2) ఎక్కువ మంది ఎస్.సి. / ఎస్.టి. కుటుంబాలు గ్రామంలో ఉన్నప్పుడు వారి ఆసక్తిని బట్టి నీటి వసతిని బట్టి వారు ఒకటి లేదా రెండు ప్రత్యేక గ్రూపులుగా ఏర్పడుతారు. వీరు ఒక్కొక్క కుటుంబానికి సభ్యత్వ రుసుము రూ. 20/- చెల్లించాలి. →

"భూమాత అపారమైన తన అడవుల్ని, వన్య ప్రాణుల్ని, నదుల్ని, సముద్రాల్ని కాపాడుకుంటున్నంత వరకూ మానవ సంతతి వర్ధిల్లుతూనే ఉంటుంది" ఉపనిషత్తులు